క్లుప్తంగా

నేడు పావగడకు నిఖిల్ కుమారస్వామి రాక



మాట్లాడుతున్న జేడీఎస్ నేతలు

పావగడ: జేడీఎస్ యువజన విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి మంగళవారం ఉదయం 10 గంటలకు పావగడకు రానున్నారు. స్థానిక ఆంజనేయశెట్టి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారని ఆ పార్టీ తాలూకా అధ్యక్షుడు ఎస్ఏ ఈరణ్ణ తెలిపారు. స్థానిక అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన జేడీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప నేతృత్వంలో నిర్వహించే నిఖిల్ కుమారస్వామి సభకు తాలూకా వ్యాప్తంగా జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేడీఎస్ నాయకులు బలరామరెడ్డి, రాజశేఖర్, సాగడు వెంకటేశ్, నేరళెకుంటె భరత్ కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం ప్రారంభం



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని మంత్రి సవిత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా తల్లికి వందనం కార్యక్రమం ప్రవేశపెట్టామన్నారు. కార్యక్రమంలో ఏపీసీ దేవరాజ్, ఈఈ రమణారెడ్డి, డీఈ చిదంబరం, ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ, తహసీల్దార్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో రీసైక్లింగ్ ప్రక్రియ...

పెనుకొండ: పట్టణంలోని వీరణ్ణ కొండ సమీపంలో వ్యర్థాలను మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పలు కార్యాలయాల నుంచి వచ్చే చెత్తా చెదారాన్ని రీసైక్లింగ్ చేసి రైతులకు అందుబాటు ధరల్లో ఎరువుల రూపంలో అందజేస్తామన్నారు. వీరణ్ణ కొండ సమీపంలో ఉన్న వ్యర్థాలను ఆమె మిషన్ ద్వారా రీసైక్లింగ్ ప్రక్రియను ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహాల ప్రతిష్ఠాపన



శివాలయంలో నవగ్రహాలను ప్రతిష్ఠించిన దృశ్యం

లేపాక్షి: మండలంలోని పులమతి పంచాయతీ పరిధిలోని పి.సడ్లపపల్లిలోని శివాలయంలో సోమవారం నవగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. కళాపూజ, కళాకర్షణ, కళాహోమం, ప్రాణప్రతిష్ఠాపన, శాంతి హోమం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, సర్పంచ్ అశ్వత్థనారాయణ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణ, గ్రామ పెద్దలు, ప్రజలు పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా అచలేశ్వర లింగ ప్రతిష్ఠ



అలంకరణలో అచలేశ్వర లింగం

హిందూపురం: అచలగురు జయదేవార్య సేవాసమాజం ఆధ్వర్యంలో హిందూపురంలోని టీచర్స్ కాలనీలో అచల ఆశ్రమంలో ఐదున్నర అడుగుల ఎత్తైన శివలింగాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నూతనంగా నిర్మాణంలో ఉన్న ఆలయంలో శ్రీచక్రము, వినాయక అచలేశ్వర లింగ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తులసి, సడియాప్పన్, సత్యనారాయణ, జీటీ శ్రీనివాసులు, హేమ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నాగుల విగ్రహ ప్రతిష్ఠ

అమరాపురం: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం నూతనంగా నాగుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, నాయకులు దేవరాజు, మాలింగప్ప తదితరుల ఆధ్వర్యంలో తీసుకొచ్చిన నాగుల ప్రతిమలను అర్చకులు మంజునాథ, విరుపాక్షప్ప వేద మంత్రాల మధ్య ప్రాణ ప్రతిష్ఠాపన చేశారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

- రైతు సేవా కేంద్రాల్లో మూలకు చేరుతున్న వైనం
- మెరుగైన సేవలకు నోచుకోని రైతులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

అమరాపురం: అన్నదాతలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వాటిని పేరును మార్చి రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. రైతులకు నిరంతరం సేవలు గ్రామాల్లో అందించాలనే ఉద్దేశంతో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. ఇందు కోసం రూ. లక్షలు వెచ్చించారు. రైతు ముంగిటకే అన్ని రకాల సేవలు అందేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అవి కియోస్క్ యంత్రాలతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేక అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

మడకశిరలో 72 యంత్రాలు

రైతులకు విత్తనం నుంచి పంట విక్రయాల వరకూ అన్నదాత వేసే ప్రతి అడుగులో అండగా నిలబడాలనే సదుద్దేశంతో కియోస్క్ యంత్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువులు, మందులు, అవసరమైన రైతులు ఈ కేంద్రాలకు వచ్చి సిబ్బందికి తెలియజేస్తారు.



అమరాపురం మండలంలో అలంకారప్రాయంగా మారిన కియోస్క్ యంత్రం

కియోస్క్ యంత్రాల ద్వారా సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఎవరికి ఏ రకం కావాలో ఇప్పించే పరిస్థితి ఉండేది. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మండలాల్లో మొత్తం 72 కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. అయితే ఇందులో చాలా యంత్రాలు పని చేయడం లేదు. దీంతో అవి అలంకార ప్రాయంగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కచ్చితమైన సమాచారాన్ని వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందించేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాతలకు సాయం చేయకపోగా గతంలో ఉన్న యంత్రాలను ఉపయోగించడం లేదు. దీంతో రైతులు తమకు ఎలాంటి సేవలు అందించడం లేదని మండిపడుతున్నారు. రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చారే గాని ఎలాంటి సేవలు అందడంలేదని విమర్శిస్తున్నారు.

నియోజకవర్గంలో ఉన్న కియోస్క్ యంత్రాలు

మండలం	యంత్రాల సంఖ్య
అమరాపురం	15
రొళ్ల	12
గుడిబండ	14
మడకశిర	19
అగళి	12

మూలన చేరుతున్న యంత్రాలు

కియోస్క్ యంత్రాల ద్వారా వాతవరణంలో మార్పులు, తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే వెసులుబాటు అందుబాటులో ఉండేది. పంట ఉత్పత్తుల మద్దతు ధరలు కూడా ఈ యంత్రాల ద్వారా రైతులు తెలుసుకునేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కియోస్క్ యంత్రాలు మూలకు చేరుతున్నాయి. గతంలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రైతులు ప్రైవేటు డీలర్ల నుంచి అధిక ధరలు చెల్లించి ఎరువులు, మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యంత్రాలు పని చేయడం లేదు



అమరాపురం మండలంలో మొత్తం 15 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి రైతు సేవా కేంద్రంలో కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. అయితే ఇవి సాంకేతిక లోపం వల్ల పని చేయడం లేదు. ప్రస్తుతం అవి పని చేయక పోవడంతో మొబైల్ యాప్‌లతో రైతులకు ఇబ్బంది కలగకుండా సేవలు అందిస్తున్నాము.

– మంజునాథ, ఏఓ, అమరాపురం మండలం

వైఎస్సార్‌సీపీ ఒత్తిడితోనే తల్లికి వందనం

- 'వెన్నుపోటు' పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, పార్టీ శ్రేణులు

చిలమత్తూరు: కేవలం వైఎస్సార్‌సీపీ ఒత్తిడితోనే షరతులతో తల్లికి వందనం అమలు చేశారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. సోమవారం హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమన్వయకర్త టీఎన్ దీపిక, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, పార్టీ నేతలతో కలిసి 'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ''జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం'' అని నినాదాలు చేశారు. అనంతరం సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ తల్లికి వందనం ఇప్పటికీ చాలా మంది తల్లుల ఖాతాలకు చేరలేదని, అంతే కాకుండా ఏవేఓ కారణాలు చూపి పేద విద్యార్థుల కడుపు కొట్టారన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో ప్రజావంచన తప్ప సంక్షేమం, అభివృద్ధి కనిపించలేదని విమర్శించారు. ఏడాదంతా కుట్రలు, కుతంత్రాలు పన్ని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధింపులకు గురిచేసి అక్రమ కేసులు పెట్టించడంతోనే సరిపోయిందన్నారు. కూటమి నేతలు అక్రమాలు, అన్యాయాలు చేస్తున్నా సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఏడాది పాలనపై సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు అధికారం ఇచ్చారో లేక ఇతరత్రా మోసాలతో గెలిచారో తెలియడం లేదని, అధికారాన్ని మాత్రం పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ''వెన్నుపోటు'' పుస్తకంలో పొందుపర్చారని, ఈ మోసాలను ప్రజలకు ప్రతి ఒక్క కార్యకర్త వివరించాలన్నారు. చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలన మోసాలతో సాగిందన్నారు. సీఎం చంద్రబాబు తీరు ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని అర్థం అవుతుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి, బాలాజీ మనోహర్, మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, రాము, సయ్యద్ నిస్సార్, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఆసిఫుల్లా, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ శ్రీరామిరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, దిలీప్‌కుమార్, కులశేఖర్‌రెడ్డి, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన సూపర్‌వైజర్‌కు సన్మానం

హిందూపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుదీర్ఘకాలం సమాచారశాఖలో డీపీఆర్ఓ ఆఫీస్ సూపర్‌వైజర్‌గా పనిచేసిన జింకల రామన్నను సన్మానించడం హర్షణీయమని పలువురు పాత్రికేయులు, వివిధ సంఘాల ప్రతినిధులు అన్నారు. పదవీ విరమణ పొందిన జింకల రామన్నను హిందూపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబానికి చెందిన రామన్న 14వ యేట పాముకాటుకు గురై కుడికాలు కోల్పోయారన్నారు. అయినా నిరుత్సాహ పడకుండా ఉన్నత కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకుని 31 ఏళ్లు సమాచారశాఖలో పనిచేస్తూ శ్రీసత్యసాయి జిల్లాలో పదవీ విరమణ పొందారన్నారు. ఆయన ఎంతో మందికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రామ్‌ప్రసాద్, జాకబ్, గంగప్ప, సూర్య ప్రకాష్, నాగరాజు, అంజప్ప, రాజేష్, శివకుమార్, రమేష్, గిరీష్, ప్రకాష్, నాగేంద్ర, దాసప్ప, విద్యార్థి సంఘం నాయకులు బాబావలి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం మనేసముద్రం వైఎస్సార్‌సీపీ నాయకుడు రామచంద్రారెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి వారి గ్రామానికి వెళ్లి లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆలయాభివృద్ధికి విరాళం

హిందూపురం: స్థానిక సడ్లపల్లిలో నూతనంగా నిర్మాణం అవుతున్న ఆంజనేయ ఆలయం అభివృద్ధికి పుల్లారెడ్డి రూ.50,116 విరాళంగా అందించారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అలాగే అదే ప్రాంతానికి చెందిన హనుమంతప్ప రూ.10,116 అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివారెడ్డి, వెంకటేష్ రెడ్డి, తిమ్మారెడ్డి, లింగారెడ్డి, బసప్ప తదితరులు ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

'కూటమికి పాలించే అర్హత లేదు'



పుస్తకావిష్కరణలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పరిగి: రాష్ట్ర ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండల కేంద్రం పరిగిలో సోమవారం వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సర్కిల్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, మండల, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబురెడ్డి సేవలు మరువలేనివి



బాబురెడ్డికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చిలమత్తూరు: హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి దివంగత బాబురెడ్డి చేసిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చల్లాపల్లి బాబురెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి మాట్లాడుతూ హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లోని పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. చిన్న వయసులోనే అకారణంగా మృతి చెందడం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కురుబ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ శివ, ఫ్లోర్‌లీడర్ ఆసిఫుల్లా, మండల కన్వీనర్లు రాము, రామకృష్ణారెడ్డి, సయ్యద్ నిస్సార్, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, కవిత, నాగమణి, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఏఓగా బాధ్యతల స్వీకరణ

సోమందేపల్లి: మండల వ్యవసాయ అధికారిగా విజయ భారతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ తమశాఖ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పెనుకొండ రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో రసాయన ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్ కృష్ణ, ఏపీఓ సంజీవరెడ్డి, న్యాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సభ్యుడు సాకప్ప పాల్గొన్నారు.

'తల్లికి వందనం' వర్తింపజేయండి

గోరంట్ల: 'అంగన్‌వాడీ వర్కర్లు చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. అందువల్ల అంగన్‌వాడీ వర్కర్లకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలి' అని అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం తహసీల్దార్ మారుతీకి వినతిపత్రం అందజేశారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

రొళ్ల: మండల కేంద్రం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న రాజ్యలక్ష్మీ అనంతపురం వ్యవసాయశాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో ఏఓను సిబ్బంది ఘన సన్మానించారు. ఇదిలా ఉండగా నూతన ఏఓగా బ్రహ్మం బాధ్యతలు స్వీకరించారు.

చిన్నారుల రక్షణపై దృష్టిసారించండి

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా, చిన్నారుల అభివృద్ధిశాఖ, జిల్లా చిన్నారుల రక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం చిన్నారుల రక్షణ చట్టం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా చిన్నారుల రక్షణ విభాగం నోడల్ అధికారి సిద్ధప్ప బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, పోక్సో చట్టం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించండి

హిందూపురం టౌన్: పురపాలక సంఘ పరిధిలోని ఉన్నత పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ టీచర్ ఫెడరేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్‌ను, కమిషనర్ మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందించారు. ఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, సామ్రాజ్యం, చంద్రశేఖర్, పెన్నోబులం, రమణ, కృష్ణమోహన్, రోహిణి, విజయ్‌కుమార్, ఎంటీఎఫ్ నాయకులు జనార్ధన్, రామాంజినేయులు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయం ముందు పడిగాపులు



18వ వార్డు సచివాలయం తెరచుకోకపోవడంతో నిరీక్షిస్తున్న ప్రజలు

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని పలు వార్డు సచివాలయాలు ఉదయం 11 గంటలైనా తెరచుకోవడం లేదు. వార్డు సచివాలయ అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 18వ వార్డు సచివాలయం సోమవారం 11 గంటలైనా తెరచుకోకపోవడంతో ప్రజలు సచివాలయం ముందు గంటల తరబడి నిరీక్షించారు. కూటమి పాలనలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అధికారులు సమయపాలన పాటించేవాళ్లని స్థానికులు తెలిపారు.

అధికారుల తప్పిదం.. రైతుకు అన్యాయం



రైతు నరసింహమూర్తి

పెనుకొండ రూరల్: ఒకే ఎల్‌పీ నంబర్ ఉమ్మడిగా ఆరుగురు రైతులకు ఉండటంతో తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన రైతు నరసింహ మూర్తి వివరాల మేరకు .. నరసింహమూర్తి భార్య ఈశ్వరమ్మ పేరు మీదగా 479–1లో 2 ఎకరాలు భూమి మాత్రమే ఉందన్నారు. తనతో పాటు గ్రామంలోని మరో ఐదుగురు రైతులకు సంబంధించి ఒకటే ఎల్‌పీ నంబర్‌లో రెవెన్యూ రికార్డుల్లో నమోదైందన్నారు. తన పేరు మీద పది ఎకరాలు పైబడి భూమి ఉన్నట్లు చూపిస్తోందని పేర్కొన్నారు. తనకు నలుగురు పిల్లలు ఉండగా అందులో, ముగ్గురు తల్లికి వందనం పథకానికి అర్హులన్నారు. అయితే భూమి ఎక్కువ ఉందనే కారణంతో తమ పేర్లు అనర్హత జాబితాలోకి వెళ్లిపోయాయన్నారు. రెవెన్యూ అధికారులు తప్పిదం వల్లనే తాము పథకానికి దూరమయ్యామని, సమస్య పరిష్కరించాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్సీ, బీసీ ఏఎస్‌డబ్ల్యూ కార్యాలయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ అద్దె భవనాలలో నడుపుతున్న ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న వసతి గృహాల భవనాలను తొలగించి నూతన భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. హాస్టల్స్‌లో డోర్లు, కిటికీలు సరిగా లేకపోవడం, కిటికీలకు దోమతెర లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు భగత్, రాజు, నాగేంద్ర, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అర్జీలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారానికి 9 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు.

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ లక్ష్మీ నరసింహ తెలిపారు. వచ్చిన అర్జీలను ఆయా మండలస్థాయి అధికారులకు పంపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కమిషనర్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

చిలమత్తూరు: మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను సోమవారం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీలో అనేక సమస్యలు తిష్ట వేశాయని వాటి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఆసిఫుల్లా, కౌన్సిలర్లు ఎస్ఏ శివ, వెంకటనాగేంద్రబాబు, షాజియా, మల్లికార్జున, రోషన్ అలీ, మద్దెన జయరాములు, నాగరాజు, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.